RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శుక్రవారం 10-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 279 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.

అర్హతలు:
- పత్రికారంగంలో ఆసక్తి కలిగి ఉండాలి.
- తెలుగు భాషపై పట్టు ఉండాలి.
- రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
- స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
- సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
- అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల: సీఎం రేవంత్ రెడ్డి

- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం
- కొత్త క్రీడా పాలసీతో క్రీడారంగానికి ప్రోత్సాహం
- గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో క్రీడలు వెనుకబడ్డాయని వ్యాఖ్య
- నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ



హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్?లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రస్థానంలో ఇదొక కీలక

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ..
- ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి



2లో



## నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెస్తానన్న హరీశ్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ



## పోక్సోలో కేసు బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు

2లో

# భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం..

- గత పాలకుల పాపాలకు ప్రక్షాళన: సీఎం చంద్రబాబు
- బనగానపల్లెలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని వెల్లడి
- భూవివాద రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- రాయలసీమలో భారీ పరిశ్రమలు, హార్టికల్చర్ హబ్‌తో అభివృద్ధికి బాటలు
- వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు 'జలధార' కార్యక్రమం ప్రారంభం



2లో

## తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

- అప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుంది
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది
- రాష్ట్ర పార్టీ నేతలతో కేంద్రమంత్రి జేపీ నడ్డా

హైదరాబాద్: బీజేపీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు తలుపులు తెరవాలని రాష్ట్ర పార్టీ నేతలకు కేంద్ర ఆరోగ్య, రసాయనాలు--ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వేరే పార్టీలకు చెందిన వారిని కలుపుకుంటేనే బీజేపీ మరింత బలోపేతం

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

- బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య


బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం

2లో



## భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం..

- ఇంధన రంగంలో కీలక ఒప్పందం
- భారత్-ఆస్ట్రేలియా ఇంధన ఒప్పందం
- యురేనియం ఎగుమతులకు మార్గం
- శాంతియుత అవసరాలకే వినియోగం
- ఐఏఈఏ పర్యవేక్షణ కొనసాగుతుంది
- స్వచ్ఛ ఇంధనంపై దృష్టి
- ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం



భారత్, ఆస్ట్రేలియా మధ్య ఇంధన భద్రతకు సంబంధించి కీలక ఒప్పందం కుదిరింది. దీంతో ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు

2లో

## పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత..

### పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!

- 38 డిమాండ్లు నెరవేర్చకపోతే భారీ నిరసనలని జేఏఏసీ హెచ్చరిక
- కశ్మీరీ శరణార్థుల 12 అసెంబ్లీ సీట్ల రద్దుపై రాజుకున్న వివాదం
- విద్యుత్, పిండి సబ్సిడీ వంటి డిమాండ్లతో నెలలుగా కొనసాగుతున్న ఆందోళనలు
- జులై 27న ఎన్నికల నేపథ్యంలో ముజఫరాబాద్‌కు భారీ మార్చ్‌కు పిలుపు

2లో

# పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత..



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని 'ఆజాద్ కశ్మీర్' అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని స్థానికులు సుదీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం తమ అంతర్భాగమేనని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం విదితమే.

# తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి



అవుతుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 'మీరు కష్టపడి పనిచేయండి మీతోపాటు మేము ఉంటాం. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రతి ఒక్కరూ అభిమానిస్తారు. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని అభిమానించేంతలా చూసుకోవాలి. కార్యకర్తలతో మంచిగా ఉండండి. వారితో మంచిగా లేకుంటే మీరు డిస్‌కనెక్ట్ అవుతారు'అని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తమకు సమాచా రం ఉందన్నారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన నడ్డా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమైనప్పుడు ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'ఇప్పటికే ఒకసారి మన బస్సు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి) మిస్సయింది. ఇంకోసారి బస్సు మిస్ కానివ్వకండి. వేర్లు లేని చెట్ల లాగా మారకండి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యతిరేకతే మనల్ని గెలిపిస్తుందనే భావనతో ఉండకండి. సొంతంగా పార్టీ గెలిచేందుకు మనం ఏం చేస్తున్నాము అనేది కూడా చాలా ముఖ్యం. నేను అవినీతికి పాల్పడను. ఇంకొకరిని అవినీతి చేయనివ్వను అన్న ప్రాథమిక సూత్రంతోనే మోదీ విజయం సాధించారు. మనమంతా కూడా మోదీ పేరు చెప్పుకొని గెలుస్తున్నా...సొంతంగా గెలుపు కోసం అనుసరించబోయే కార్యాచరణ ఉందా ? మీ అంత మీరు గెలిచేందుకు ఏం చేస్తున్నారు? ఆత్మవిమర్శ చేసుకోండి. అవినీతితో పోరాడడంతోపాటు ఎల్లప్పుడూ ప్రజల పక్కనే చేదోడువాదోడుగా నిలిస్తే తప్పకుండా వారు ఆదరిస్తారు.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

# విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్–హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ–కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

# భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల అరాచకాలు, పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, వారి నల్ల చట్టాలను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని ఆయన అన్నారు. నేడు నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి– మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజావేదిక సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ప్రజల ఆస్తులను కాజేసేందుకు, వారిలో భయాందోళనలు సృష్టించేందుకే దానిని తెచ్చారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. "గత పాలకులు తమకు నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను 22ఏ జాబితాలో పెట్టేశారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కోవాలని చూశారు. భూమి పత్రాలపై, చివరికి సర్వే రాళ్లపై కూడా వారి ఫొటోలు వేసుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని రద్దు చేసి, ఇప్పుడు రాష్ట్ర రాజముద్రతో, పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పంపిణీని ఒక పవిత్ర ఉద్యమంగా చేపడుతున్నామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాలను పరిష్కరించామని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తులను సులభంగా బదిలీ చేసే ప్రక్రియను అమలు చేస్తున్నామన్నారు. రాయలసీమ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, ఆమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ (స్టెల్త్ యుద్ధ విమానం) వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ తయారైన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయని అన్నారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో నీటి భద్రత కోసం 'జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవడం ద్వారానే నీటి భద్రత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ దిశగా 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన నంద్యాల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల: సీఎం రేవంత్ రెడ్డి

ముందడుగు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 1990 నుంచి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అటువంటి మెగా ఈవెంట్లు జరగకపోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నూతన క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చే నవంబర్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అపారమైన జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్ పతకాల సాధనలో వెనుకబడి ఉండటంపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానపరమైన లోపాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఉపాధికి, ఉజ్వల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరఫున బిడ్ దాఖలు చేయాలని లేదా భారత్‌కు ఆ అవకాశం దక్కితే కనీసం కొన్ని క్రీడా విభాగాలనైనా ఇక్కడ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే గచ్చిబౌలి స్టేడియాల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం..

యురేనియం ఎగుమతులకు మార్గం సుగమమైంది. ఇంధన రంగంలో రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అడుగుగా దీనిని భావిస్తున్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అణుశక్తి రంగంలో కీలక ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం ఏర్పడుతుందని మోదీ తెలిపారు. ఇది దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు కొత్త ఊతం ఇస్తుందని చెప్పారు. రెండు దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇంధన వాణిజ్యం, సరఫరా వ్యవస్థ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వినియోగం పెంపుపై కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. 2015లో కుదిరిన అణు సహకార ఒప్పందం కింద యురేనియం ఎగుమతులకు అవసరమైన పరిపాలనా ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చే యురేనియం పూర్తిగా శాంతియుత అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశాయి. దీనిపై 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ' భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా, ధరలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. అయినా ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు కొనసాగిస్తామని వెల్లడించాయి. ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో ఆస్ట్రేలియా, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో భారత్ కీలక భాగస్వాములని రెండు దేశాలు గుర్తించాయి. పునరుత్పాదక ఇంధనం, తక్కువ కాలుష్య ఇంధనాలు, పెట్టుబడులు, ప్రాంతీయ సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించాయి. బొగ్గు, డీజిల్, సహజ వాయువు వంటి ఇంధనాల సరఫరా స్థిరంగా కొనసాగేలా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశాయి. భారత్ ప్రారంభించిన గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయన్స్ కార్యక్రమాన్ని కూడా ఆస్ట్రేలియా స్వాగతించింది.

# తిరుమలలో భారీ సర్పం... హడలిపోయిన భక్తులు!

**తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో భారీ పాము కలకలం**

**సుమారు 9 అడుగుల పొడవున్న పామును చూసి భయపడిన స్థానికులు**

**పట్టుకునే క్రమంలో టీటీడీ ఉద్యోగి కాలికి చుట్టుకున్న పాము**

**చాకచక్యంగా పామును బంధించి అడవిలో వదిలిన సిబ్బంది**



పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో గురువారం భారీ పాము కలకలం రేపింది. నారాయణగిరి ఉద్యానవన షెడ్ ప్రాంతంలో సుమారు 9 అడుగుల పొడవున్న జెర్రిపోతు పామును గమనించిన భక్తులు, స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంటనే స్పందించారు. వన్యప్రాణులను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన టీటీడీ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన పామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, అది అనూహ్యంగా ఆయన కాలికి చుట్టుకోవడంతో అక్కడున్న వారు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. అయితే, భాస్కర్ నాయుడు ఏమాత్రం అధైర్యపడకుండా ఎంతో చాకచక్యంగా వ్యవహరించి, ఆ పాము నుంచి విడిపించుకోవడమే కాకుండా దానిని బంధించారు. అనంతరం ఆ పామును సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుమల క్షేత్రం శేషాచలం అటవీ ప్రాంతం మధ్యలో ఉండటం వల్ల అప్పుడప్పుడు వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తుంటాయని, భక్తుల రక్షణ విషయంలో టీటీడీ యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు.



## మూడు నెలలుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ.. బీజేపీ నేతల నిరసన

మేడ్చల్: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 297వ డివిజన్‌లో జాతీయ రహదారి-44ను ఆనుకుని ఉన్న వినాయక్ నగర్ ముఖద్వారం వద్ద గత మూడు నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సమస్య కారణంగా ప్రతిరోజూ వేలాది మంది బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, మేడ్చల్ ప్రాంతాన్ని గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన పాలకులు, ప్రజల మౌలిక సమస్యలను మాత్రం పూర్తిగా విస్మరించారని విమర్శించారు. మూడు నెలలుగా డ్రైనేజీ సమస్య కొనసాగుతున్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు స్పందించకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జకట ప్రేమ్ దాస్, ఉపాధ్యక్షుడు మైసరి రాజు, కోశాధికారి ఉపేందర్ గుప్తా, సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రాఘవ రెడ్డి, నెమూరి శ్రీనివాస్ గౌడ్, వంశీధర్ రెడ్డి, గోపు నాగరాజు, పికెట్ మల్లికార్జున్‌తో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## టీసీఎస్ మత మార్పిడి కేసులో నిదా ఖాన్‌కు బెయిల్.. శ్రీకృష్ణుడి జననాన్ని ప్రస్తావించిన నాసిక్ కోర్టు




నాసిక్‌లోని టీసీఎస్ అనుబంధ బీపీఓలో మత మార్పిడికి ఒత్తిడి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నిదా ఖాన్‌కు ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి కావడంతో, జైలులో ప్రసవించడం వల్ల పుట్టబోయే శిశువుపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు, తన ఉత్తర్వుల్లో శ్రీకృష్ణుడి జననాన్ని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేక న్యాయమూర్తి కే.జీ. జోషి గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో, "జైలులో శ్రీకృష్ణుడిలా జన్మించడం లేదా ఆ తర్వాత ఎదురయ్యే సామాజిక అవమానాన్ని ఎవరూ భరించలేరు. పుట్టబోయే బిడ్డ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిందితురాలికి బెయిల్ మంజూరు చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైనందున, నిందితురాలిని మరింత కాలం కస్టడీలో ఉంచాల్సిన అవసరం లేదని న్యాయస్థానం అభిప్రాయపడింది. నాసిక్‌లోని టీసీఎస్ బీపీఓ యూనిట్‌లో మత మార్పిడి యత్నాలు, లైంగిక వేధింపుల ఆరోపణలపై ఈ ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో పోలీసులు మొత్తం తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులు ఉండగా, నిదా ఖాన్ వారిలో ఒకరు. ఓ సహోద్యోగికి బురఖా, మతపరమైన గ్రంథాలు అందజేసి, నమాజ్ నేర్పించి మతం మార్చేందుకు ప్రయత్నించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మే 7న ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు పలు షరతులు విధించింది. ఫిర్యాదుదారులు, సాక్షులను ఎలాంటి విధంగానూ ప్రభావితం చేయరాదని, కార్యాలయానికి వెళ్లరాదని, దేశం విడిచి వెళ్లరాదని స్పష్టం చేసింది. ఇదే కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడు డానిష్ షేక్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగిస్తోంది.

## ప్రశ్న రావణ్ కేసులో కీలక పరిణామం..

**రెండు బ్యాంకుల ఖాతాలు నిలిపివేత**

**పవన్ కల్యాణ్‌పై విద్వేష వీడియోల కేసులో చర్యలు**

**యూట్యూబర్ రావణ్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసిన పోలీసులు**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత, పరువు నష్టం కలిగించే వీడియోలు రూపొందిస్తున్నారనే ఆరోపణలపై వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ రావణ్ అలియాస్ 'ప్రశ్న' రావణ్‌పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి ఆయనకు చెందిన బ్యాంకు ఖాతాలను అధికారులు స్తంభింపజేశారు. 'ప్రశ్న' అనే మాధ్యమం ద్వారా విద్వేషాన్ని రెచ్చగొట్టే వీడియోలను పోస్ట్ చేస్తూ రావణ్ నెలకు రూ. 1.5 లక్షలకు పైగా ఆర్జిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఆర్థిక లావాదేవీలను గుర్తించిన అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమించారు. రావణ్‌కు ఖాతాలు ఉన్న ఐసీఐసీఐ, యస్ బ్యాంకులకు పోలీసులు లేఖలు రాయడంతో, ఆయా బ్యాంకు యాజమాన్యాలు సదరు ఖాతాలను తక్షణమే నిలిపివేశాయి. ఏలూరులో జరిగిన ఒక సభలో చేసిన వ్యాఖ్యలతో పాటు, రావణ్ రూపొందించిన పలు అభ్యంతరకర వీడియోలపై అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన చంద్రబాబు ప్రభుత్వం...




నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

**అక్కడికక్కడే పరిష్కారం**

ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

**రైతుల ఆనందం**

తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూములు తమ పేరు మీదే ఉన్నా, గత ప్రభుత్వ చర్యల వల్ల అమ్ముకోలేక, వ్యవసాయ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని రైతులు ముఖ్యమంత్రి వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు ఇంత వేగంగా, స్వయంగా ముఖ్యమంత్రి చొరవతో పరిష్కారం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని, రాష్ట్రంలో ఎక్కడా రైతులు ఇబ్బంది పడకూడదన్నదే తమ లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైతులకు భరోసా ఇచ్చారు.

**రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారంపై దృష్టి**

బేతంచర్ల తరహాలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లోని భూ సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపింది. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులను తొలగిస్తూ, లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో వేలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

## పీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు: కడియంపై చర్యలు కోరిన మంత్రి

**తనకు తెలియకుండా తన దేవాదాయ శాఖలో సమీక్ష నిర్వహించారని ఫిర్యాదు**

**సీఎం, మీనాక్షి నటరాజన్ దృష్టికీ తీసుకెళ్లినట్లు వెల్లడి**

**ఎదుటివాళ్ల ఎదుగుదలను కడియం ఓర్వలేరని విమర్శ**

మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు.



## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

## టీజీఎస్ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు.. రాత పరీక్ష లేకుండానే ఎంపికలి

తెలంగాణ నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టనుండగా, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ పోస్టులను భర్తీ చేయనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నియామకాల్లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అంశం ఏమిటంటే.. ఎలాంటి రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ నిర్వహించరు. పదో తరగతిలో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం మెరిట్ జాబితాను రూపొందించి నేరుగా ఎంపిక



చేపట్టనున్నారు. దీంతో పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే అవకాశం లభించడంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత కొన్నేళ్లుగా ఆర్టీసీలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో కండక్టర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి నగరాల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే సేవలు కొనసాగించారు. ఇప్పుడు శాశ్వత నియామకాలకు అనుమతి లభించడంతో ఆర్టీసీ సేవలు మరింత బలోపేతం కానున్నాయి. అయితే అధికారిక నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక సాంకేతిక అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా, అనంతరం కొన్నేళ్ల పాటు జీపీఏ (గ్రేడ్) విధానాన్ని అమలు చేసింది. ఇటీవల మళ్లీ మార్కుల విధానానికి తిరిగి రావడంతో కొందరి సర్టిఫికెట్లలో మార్కులు, మరికొందరివాటిలో గ్రేడింగ్ మాత్రమే ఉండే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంగా ఎలా మార్పిడి చేయాలి, రెండు విధానాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే అంశాలపై మార్గదర్శకాలు ఇవ్వాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డును కోరారు. బోర్డు నుంచి మార్గదర్శకాలు అందిన వెంటనే 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# వేడుకకు చిరునామా ఆల్ఫా: ఆలియా భట్



"ఆల్ఫా' పరంగా నాకు బాగా నచ్చిన విషయం ఈ మూవీ స్టోరీ ఇద్దరు కథానాయికల చుట్టూ తిరగడం. ఇలాంటి స్క్రిప్ట్‌లు చాలా అరుదుగా వస్తాయి. అందుకే 'ఆల్ఫా' జర్నీలో భాగం కావడం సంతోషాన్నిచ్చింది. వేడుకకు ఓ చిరునామాలా ఈ సినిమా నిలుస్తుంది" అని ఆలియా భట్ పేర్కొన్నారు. ఆలియా భట్, శార్వరి లీడ్ రోల్స్‌లో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన చిత్రం 'ఆల్ఫా'. ఈ సంస్థ నుంచి స్పై సినిమాలు చాలా వచ్చాయి. కానీ అవి హీరో ఓరియంటెడ్ సినిమాలు. ఈ సంస్థలో స్పై యూనివర్స్‌లో రూపొందిన తొలి మహిళా ప్రధాన చిత్రం 'ఆల్ఫా'. ఈ సినిమాలో పవర్‌ఫుల్ స్పై ఏజెంట్లుగా నటించారు ఆలియా, శార్వరి. శివ్ రావైల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆలియా భట్ మాట్లాడుతూ-- "ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో చాలా ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసినవాటిలో 'ఆల్ఫా' ఒకటి. ప్రతి రోజూ చాలా ఆసక్తిగా షూటింగ్‌కి వెళ్లేదాన్ని. యాక్షన్ నేపథ్యంలో సాగే 'ఆల్ఫా' నాకు సరికొత్త అనుభూతినిచ్చింది" అని చెప్పారు.

# ఓ ఉపాధ్యాయుడి కథ 'సూపర్ సుబ్బు'

సందీప్‌కిషన్, మిథిలా పాల్కర్ జంటగా నటిస్తున్న కామెడీ వెబ్‌సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇందులో సందీప్‌కిషన్ సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు అనే ఉపాధ్యాయుడి పాత్రలో కనిపించనున్నారు. మాకిపూర్ అనే గ్రామానికి టీచర్‌గా వెళ్లిన అతనికి అక్కడ ఎదురైన పరిస్థితులు, జీవితాన్ని మార్చే సంఘటనల నేపథ్యంలో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ఈ సిరీస్‌లో సాధారణ ప్రజలు మాట్లాడటానికి సంకోచించే ఓ సీరియస్ అంశాన్ని హాస్యం, భావోద్వేగాలు మేళవించి చెప్పే ప్రయత్నం చేశామని, సమస్యను పరిష్కరించాలనుకొని తానే ఇబ్బందుల్లో చిక్కుకునే ఉపాధ్యాయుడిగా తన పాత్ర ఆద్యంతం వినోదభరితంగా సాగుతుందని సందీప్‌కిషన్ తెలిపారు. హాస్యంతో పాటు మానవ సంబంధాల ఆవశ్యకతను చర్చించే సినిమా ఇదని కథానాయిక మిథిలా పాల్కర్ పేర్కొన్నది. ఈ సిరీస్‌లో బ్రహ్మానందం, గెటప్ శ్రీను, మానస చౌదరి తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించారు. వీశీఙఅవం



# దక్షిణాదిలో ఆ స్వేచ్ఛ లేదు!

దక్షిణాది సినీరంగంపై అగ్ర కథానాయిక తమన్నా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది సినిమాల్లో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుందని, కథానాయికల్ని గ్లామరస్‌గా చూపించడానికే అధిక ప్రాధాన్యతనిస్తారని తమన్నా వ్యాఖ్యానించింది. 'హిందీ చిత్రసీమలో రెండు రకాల నటులుంటారు. కొందరు అభినయప్రధాన పాత్రల్ని ఎంచుకొని కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటారు. మరికొందరేమో కేవలం గ్లామర్‌కే పరిమితమవుతారు. బాలీవుడ్‌లో ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. కానీ దక్షిణాదిలో మాత్రం నటన, గ్లామర్‌ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది' అని తమన్నా పేర్కొన్నది. ఆమె మాటలపై దక్షిణాది అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తెలుగు, తమిళం ద్వారానే స్టార్‌డమ్‌ను సంపాదించుకొని విశ్వాసం లేకుండా ఇలాంటి మాటలు మాట్లాడటం తగదని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.





# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.


# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్ పై ప్రొడక్షన్ హౌస్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు అలాగే ఖండించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త కంగారు పడుతున్నారు. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే వస్తుందా లేదా లాంగ్ డిలే అవుతుందా అనేది తెలియాలంటే మేకర్స్ క్లారిటీ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# సెప్టెంబర్‌లో రానున్న సర్దార్-2

నీళ్ల మాఫియా గురించి చర్చిస్తూ సందేశాత్మక కథాంశంతో గూఢచారి థ్రిల్లర్‌గా రూపొందిన 'సర్దార్' చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన 'సర్దార్-2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. కార్తి కథానాయకుడిగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. బుధవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సీక్వెల్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ గురించి చర్చించబోతున్నట్లు తెలిసింది. గూఢచారి వ్యవస్థ చుట్టూ అల్లుకున్న ఈ కథలో దేశభక్తి, సామాజిక సందేశం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. మాళవిక మోహనన్, ఎస్‌జే సూర్య, ఆషికా రంగనాథ్, యోగిబాబు, రజిషా విజయన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాతలు: ఎస్.లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా, దర్శకత్వం: పీఎస్ మిత్రన్.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/